క్లుప్తంగా

బాబు బూటకపు హామీలు నమ్మొద్దు

వార్డుల్లో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం



గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గంలోని 25వ డివిజన్‌లో కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి ఆధ్వర్యంలో ''బాబూ ఆపు నీ నాటకం–జగనన్నే మా నమ్మకం'' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీనగర్, మహర్షి దయానంద నగర్ రెండో లైను ప్రాంతాల్లో 77, 79 వార్డు సచివాలయాల కన్వీనర్లు మామిడి వెంకటేశ్వర్లు, ఓర్చు ఏడుకొండలు ఇంటింటికీ వెళ్లి నవరత్నాల కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. చంద్రబాబు ఇస్తున్న బూటకపు హామీల్ని నమ్మవద్దని ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఆయా కార్యక్రమాల ప్రగతి పత్రాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల్ని పొందుతున్న లబ్ధిదారులు సీఎం వై.ఎస్. జగన్ పరిపాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వలంటీర్లతో పాటు 22, 24 క్లస్టర్ల గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హీరో వెంకటేష్ పుట్టిన రోజు వేడుకలు



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని సురేష్ మూవీస్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ కార్యాలయంలో బుధవారం హీరో వెంకటేష్ జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటర్లు వెంకటేష్ జన్మదిన కేక్ కట్ చేసి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం రెడ్డిపాలెంలోని మానవతా వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాదల రత్తయ్య, వి.చిన్నా, సుబ్బారావు, సత్యనారాయణ, రాంబాబు, మణికంఠ పాల్గొన్నారు.

ఘంటసాల గానం ఆపాత మధురం



లక్ష్మీపురం: తెలుగు సినీగీతాన్ని, సంగీతాన్ని సుసంపన్నం చేసిన మహా గాయకుడు ఘంటసాల అని అవగాహన సంస్థ సభ్యులు కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం మహా గాయకుడు ఘంటసాల శత జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ రంగ విశ్లేషకులు ఎ.అమరాచారి మాట్లాడుతూ నారద, తుంబురులు తమ గానామృత ధారలతో ఒక గంధర్వ గాయకుడిని సృష్టించారని, ఆయనే ఘంటసాల వెంకటేశ్వరరావు అని వివరించారు. సీనియర్ గాయకుడు రత్నాజీ మాట్లాడుతూ పాటకు పద్ధతిని రూపొందించిన ఘంటసాల బాణిని అనుసరించని వారు లేరని తెలిపారు. అనంతరం పలువురు గాయకులు ఘంటసాల పాటలు పాడి నీరాజనం అర్పించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్, శర్మ, భాగ్యలక్ష్మి, రమేష్, వి.రామారావు, ఎస్.కోటేశ్వరరావు, కోటిరెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో ఆగంతకుడు బంగారు గొలుసు లాక్కొని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేట 6వ లైనులో నివాసం ఉండే గాయత్రీదేవి బుధవారం రాత్రి ఇంటి నుంచి నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని పది గ్రాముల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బీభత్సం : వ్యక్తికి గాయాలు

కారు పలువురిని ఢీకొని బీభత్సం సృష్టించిన ఘటనపై పశ్చిమ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి కారు నడుపుతూ అరండల్‌పేటలోని పలు అడ్డ రోడ్లల్లో ద్విచక్ర వాహనదారుల్ని ఢీకొట్టాడు. తర్వాత వేగంగా నడుపుతూ డొంకరోడ్డు వైపు వెళ్లాడు. సాంబశివపేట రెండో లైనులో ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. స్థానికులు కారు నడుపుతున్న వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరక్కుండా నెహ్రూనగర్ వైపు వెళ్లాడు. కారు ఢీకొని గాయపడిన షేక్ సుభాని ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఇచ్చిన కారు నంబరు బట్టి నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఈవీఎంలపై అవగాహనకు మొబైల్ కేంద్రాలు

- నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి
- ఫిబ్రవరి నెలాఖరు వరకు నగరంలో అందుబాటులో వాహనాలు



వాహనాలను ప్రారంభిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఓటర్లకు ఈవీఎం, ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్‌పై అవగాహన కలిగించేందుకు ప్రత్యేకంగా మొబైల్ కేంద్రాల్ని అందుబాటులోకి తెచ్చినట్లు నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం అవగాహన వాహనాల్ని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), ఓటర్ వెరిఫికేషన్, పేపర్ ఆడిట్‌పై అవగాహన కలిగించడానికి ఇప్పటికే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, బృందావన్ గార్డెన్స్‌లోని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు ఓటుపై క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించేందుకు మొబైల్ వాహనాల్ని కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వాటిల్లో ఈవీఎంలు ఉంటాయన్నారు. నగరంలోని ప్రధాన కేంద్రాల్లో ప్రజలకు వాటిపై ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వాహనం వెంబడి పోలీస్ బందోబస్త్ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండి ఈవీఎం ద్వారా ఓటు వేయడం, సరి చూసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని ఆమె పేర్కొన్నారు. వాహనాలు ఫిబ్రవరి నెలాఖరు వరకు ఉంటాయని, నగరంలోని రెండు నియోజకవర్గాల ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్లు తమ ఓటుకు సంబంధించిన ఏ సందేహం ఉన్నా తీర్చడానికి వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. తూర్పు నియోజకవర్గానికి 0863-2345104, పశ్చిమ నియోజకవర్గానికి 0863- 2345105 నంబర్లను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా ఆపరేటర్లను నియమించామని తెలిపారు. ఓటర్లు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఫోన్ చేసి తమ ఓటుకి సంబంధించి ఏ సందేహం ఉన్నా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఏఈఆర్వోలు సీహెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మేనేజర్ శివన్నారాయణ పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా



డ్రెయిన్‌లో పూడికతీతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. 56వ డివిజన్ నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ రైల్వేగేటు, వెంకటాద్రిపేట తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనుల్ని తనిఖీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో సైడ్ డ్రెయిన్స్‌లో చెత్త పేరుకుపోయి ఉండటం గమనించి దగ్గరుండి వాటిని శుభ్రం చేయించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. వెంకట్రాదిపేటలో శిథిలావస్థలో ఉన్న పాతశాలను కూల్చి వేయాలని ఏఈ అనూషని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ, 55వ డివిజన్ కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్ సలాం, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

మేయర్ కావటి మనోహర్‌నాయుడు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, నేతలు

నెహ్రూనగర్: నగరంలో శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. తూర్పు నియోజకవర్గం 50వ డివిజన్‌లోని శారదా కాలనీ ప్రధాన రహదారిని బుధవారం రూ. 1.21 కోట్లతో సీసీ రోడ్డుగా నిర్మించేందుకు స్థానిక కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమాతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం చేపడితే స్థానిక ప్రజలకే కాక, మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు వైపు, అమరావతి రోడ్డు వైపు వెళ్లేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే సదరు ప్రాంతంలోని సైడు కాలువలు నిర్మాణం పూర్తయిందని, రోడ్డు మార్జిన్లలో ఆక్రమణల్ని తొలగించి, రోడ్డు విస్తరించి రూ.1.21కోట్లతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని వివరించారు. నగరంలో అన్ని వార్డులలో అభివృద్ధి పనులు కుల,మత, ప్రాంత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

డెప్యూటీ మేయర్ షేక్ సజీల



రక్తదానం చేస్తున్నవారిని అభినందిస్తున్న డెప్యూటీ మేయర షేక్ సజీల

గుంటూరు మెడికల్: రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. వైఎస్సార్ సీపీ 37వ డివిజన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా చంద్రమౌళీనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మెగా రక్తదానం నిర్వహించారు. షేక్ సజీల ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో అంచెలంచెలుగా ఆనం సంజీవరెడ్డి ప్రజా నేతగా ఎదిగారని కొనియాడారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ మురళీ బాబూరావు మాట్లాడుతూ ఒక్కో వ్యక్తి ఏడాదిలో నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా శరీరంలో నూతన రక్తం ప్రవహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆనం బాలవాణి, డాక్టర్ నందగోపాల్‌రెడ్డి, డాక్టర్ నర్మద సాయి, ఉడతా బాలకృష్ణ, వెంకాయమ్మ, ల్యాబ్ అండ్ ఎక్సరే ఓనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రేపు జీజీహెచ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జీజీహెచ్ హెడ్ నర్సు రోజీరాణి బుధవారం తెలిపారు. ఆసుపత్రిలోని శుశ్రుత హాలులో ఉదయం 11గంటలకు జరిగే వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమె వెల్లడించారు. నర్సింగ్ సిబ్బంది పాల్గొనాలని ఆమె కోరారు.

వలంటీర్ల ఇంటర్వ్యూలకు 120 మంది హాజరు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న డెప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టులకు బుధవారం డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, కె.రవీంద్ర ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 58 వలంటీర్ల పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా 322 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో 99 దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన అనంతరం 223 మందిని అర్హులుగా ప్రకటించగా, వారిలో 120 మంది ఇంటర్వ్యూకి హాజరయ్యారని వివరించారు. ఎంపికైన వారి ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, ఈ నెల 18 నుంచి విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: బీజేపీ



జేసీ రాజకుమారిని కలసి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తులిమిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతలు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని కలసి వినతిపత్రం అందజేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండురంగ విఠల్ మాట్లాడుతూ తుఫాన్ వల్ల జిల్లాలో నష్టపోయిన రైతుల్ని ఆదుకుని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని విన్నవించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ కేంద్రం విడుదల చేసిన తక్షణ సాయాన్ని కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మార్కెట్ యార్డు సెల్ కన్వీనర్ రాయ నాగేశ్వరరావు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి సుధాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారుపల్లి సాంబశివరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీతారామయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు పద్మనాభం, కార్యదర్శులు జూపూడి దుర్గాభవాని, కత్తి మేరీ సరోజిని, ఏలూరి లక్ష్మి, దానబోయిన శివయ్య, అసెంబ్లీ కన్వీనర్లు కన్నా రవి దేవరాజ్, వరికూటి వీరసుధాకర్, పంచుమర్తి ప్రసాద్, దర్శనం శ్రీనివాస్, బీజేపీ నేతలు దారా అంబేడ్కర్, నడ్డి నాగమల్లేశ్వరి, నవనీత్ కృష్ణారెడ్డి, అప్పిశెట్టి రంగా, కోలా రేణుకాదేవి, రమణ, నాగమల్లేశ్వరి, జితేంద్ర గుప్తా, శోభన్ బాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం అవసరం

ఏఎస్పీ సుప్రజ



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఏఎస్పీ సుప్రజ, డీవైఈవో వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యాన్ని కనబర్చడం ద్వారా విద్యార్థులు మేటి క్రీడాకారులుగా ఎదగాలని అదనపు ఎస్పీ ఈ. సుప్రజ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఆక్స్‌ఫర్డ్ స్కూల్ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ సుప్రజ జ్యోతిని వెలిగించి, క్రీడా పోటీల్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో ఏదైనా సాధించాలనే కసి, పట్టుదల ఉండాలన్నారు. అందుకు నిరంతర సాధనతో ఆటలు ఆడాలని సూచించారు. ఆటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. క్రికెట్‌లో బెస్ట్ ప్లేయర్ సచిన్ టెండూల్కర్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధును స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి గల రంగంలో ప్రోత్సహించడం ద్వారా వారిని ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దవచ్చని, ఈ బాధ్యతను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల విజేతలకు పాఠశాల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్. ఆరోన్‌రెడ్డి, ఎస్. విజయభాస్కర్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, అనిల్, మల్లికార్జునరావు, షరీఫ్, విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్పాహారం, దుప్పట్ల పంపిణీ



గుంటూరు మెడికల్: పవన్ జోవిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బ్రాడీపేటలోని షిర్డీ సాయి దీనజన సేవాసమితి అంధుల పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. యాచకులకు భోజనం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పవన్ జోవిత ఫౌండేషన్ ఫౌండర్ సీదా పవన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పేదలు, అనాథలకు తమవంతు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుమార్, దిలీప్, నవ్య, ప్రియ, శివ కుమార్ పాల్గొన్నారు.



వివిధ వేషధారణలలో చిన్నారులు

భళా... బాలోత్సవ్ !



వీవీఐటీలో మూడు రోజుల పాటు వైభవంగా జరిగిన బాలోత్సవ్ –2023 వేడుకలు బుధవారం ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు పలు వేషధారణల్లో 'జిగేల్' మన్నారు. జానపద నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. బాలబాలికల తీపి గుర్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధురానుభూతుల మధ్య వేడుకలు కోలాహలంగా ముగిశాయి. – పెదకాకాని



మట్టి బొమ్మల తయారీలో చిన్నారులు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మిర్చి యార్డులో 'గుంటూరు కారం' చిత్ర యూనిట్ సందడి

పాత గుంటూరు: హీరో మహేష్ బాబు నటిస్తున్న గుంటూరు కారం చిత్ర యూనిట్ బుధవారం గుంటూరులో సందడి చేసింది. చిత్ర షూటింగ్‌లో భాగంగా మిర్చి యార్డులో ఓ సన్నివేశాన్ని చిత్రీకరించారు. చిత్రంలో మహేష్ నడిపే జీపు నగరంలో తిరగడంతో సందడి నెలకొంది.

ఎస్సీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఎస్సీలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇచ్చి ఎక్కువ సీట్లు కేటాయించాలని మాల ఐక్య సేవా సమితి అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్‌బాబు కోరారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. మాదిగలు ఎక్కువగా ఉన్న చోట మాదిగలకు, మాలలు అధికంగా ఉన్న చోట మాలలు సీట్లు కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చిన్నం డేవిడ్ విలియమ్స్, కొండపల్లి విల్సన్, కాలే ఉదయ్‌కుమార్, రత్నరాజు, ప్రసన్నకుమారి, జ్యోతి పాల్గొన్నారు.